# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people


## ఎవరి కులం ఎంతో! వారికంత వాటా కావాలి

- బీసీ ఎస్సీ ఎస్టీ జాక్ భారీ బహిరంగసభ కరపత్రం ఆవిష్కరణ

03




బుధవారం 10, జూన్ 2026 | సంపుటి :03 | సంచిక :120 | పేజీలు :05 | వెల ₹5






## ఆర్అండ్ బీలో కలకలం

- ఈఎన్సీ మోహన్ నాయక్ ఇళ్లపై ఏసీబీ పంజా
- 15 చోట్ల ఏకకాలంలో సోదాలు
- భారీగా రూ.కోట్ల అక్రమాస్తులు గుర్తింపు..
- కుప్పలుతెప్పలుగా నగదు, బంగారం, స్థిరాస్తి పత్రాలు స్వాధీనం
- గతంలో వరంగల్ ఎస్ఈగా పనిచేసిన మోహన్ నాయక్
- కొంతమంది కాంట్రాక్టర్ల పేరిట ఆస్తుల కొనుగోలు

ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే సమాచారంతో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ (ఆర్అండ్ బీ) ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) మోహన్ నాయక్ ఇళ్లు, కార్యాలయాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోమవారం ఏకకాలంలో దాడులు జరిపారు. వివిధ జిల్లాల్లోని మొత్తం 15 ప్రాంతాల్లో ఏకకాలంలో సాగిన ఈ దాడులు అధికార వర్గాల్లో తీవ్ర కలకలం రేపాయి. తనిఖీల్లో భారీ ఎత్తున నగదు, బంగారు నగలు, బిస్కెట్లు, రూ.కోట్ల విలువైన స్థిరాస్తుల డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రోడ్లు, భవనాల శాఖ ఈఎన్సీగా పనిచేస్తున్న మోహన్ నాయక్ భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడి ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో పక్కా నిఘా పెట్టిన అధికారులు సోమవారం తెల్లవారుజామున రంగంలోకి దిగారు. హైదరాబాద్ లోని ఆయన ప్రధాన నివాసంతో పాటు నిజామాబాద్ జిల్లాలోని మోహన్ నాయక్ ఫాం హౌస్, వివిధ జిల్లాల్లోని బంధువులు, సన్నిహితులు, బినామీల ఇళ్లపై 15 ప్రత్యేక బృందాలుగా విడిపోయి ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. - అక్షరదర్బార్, హైదరాబాద్




## గ్రేటర్ వరంగల్‌లో స్ట్రీట్ ఫుడ్ హబ్

- కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక దృష్టి.. రూ.4 కోట్ల నిధులు మంజూరు

02

గ్రేటర్ వరంగల్ నగర ప్రజలకు త్వరలోనే నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహార ప్రియుల స్వర్గధామం 'స్ట్రీట్ ఫుడ్ హబ్' అందుబాటులోకి రానుంది. కేంద్ర ప్రభుత్వ గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వీధి వ్యాపారుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ఈ ప్రత్యేక ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఇందులో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ జాయింట్ డైరెక్టర్ ఈషా కిరణ్ మంగళవారం ఢిల్లీ నుండి స్వయం సహాయక సంఘాలు, స్ట్రీట్ ఫుడ్ అభివృద్ధి కార్యక్రమాలపై నిర్వహించిన ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో జీడబ్ల్యూఎంసీ అధికారులు పాల్గొన్నారు. - అక్షరదర్బార్, వరంగల్

- కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ జాయింట్ డైరెక్టర్‌తో జీడబ్ల్యూఎంసీ అధికారుల వీసీ
- తెలంగాణ నుంచి ఎంపికైన ఐదు నగరాల్లో వరంగల్, ఖమ్మం
- వచ్చే వారం వరంగల్‌కు కేంద్ర అధికారుల బృందం రాక



## వానకాలానికి డీలర్లు సన్నద్ధం కావాలి

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర

03

## 20న భూపాలపల్లిలో మెగా లోక్ అదాలత్

రాజీమార్గమే రాజమార్గం అవుతుందని చిట్యాల ఎస్ఐ సతీష్ విజ్ఞప్తి..

02

# జిల్లాకు 12 'మహిళా శక్తి' బస్సులు

- ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- పరేడ్ గ్రౌండ్స్ 'మహిళా శక్తి మహాసభ'లో లబ్ధిదారులకు అందజేత
- వడ్డీ లేని రుణాలు రూ.10 లక్షలకు పెంపు సీఎం ప్రకటన



అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్వావలంబన దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. జిల్లాలోని 12 మండలాల మహిళా సంఘాలకు నూతనంగా కేటాయించిన బస్సులను మంగళవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'ఇందిరా మహిళా శక్తి మహాసభ'కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన ఈ ప్రత్యేక బస్సులను జెండా ఊపి ప్రారంభించి, హనుమకొండ జిల్లా లబ్ధిదారులకు అందజేశారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో 'ఇందిరా మహిళా శక్తి' పథకం కింద ఈ బస్సులను కొనుగోలు చేశారు. ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని వీక్షించేందుకు హనుమకొండ జిల్లాలోని 12 మండలాల నుండి దాదాపు 600 మంది మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉదయాన్నే ప్రత్యేక ఆర్టీసీ బస్సుల్లో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. పట్టణ పరిధిలోని కాజీపేట, హనుమకొండ మండలాలు మినహాయించి, మిగతా మండలాల నుండి ప్రతి బస్సులో 50 మంది మహిళా సభ్యులతో పాటు ఏపీఎం, మహిళా పోలీస్, ఆశా కార్యకర్తలు ఈ సభకు హాజరయ్యారు.

**రూ.500 కోట్ల వడ్డీ లేని రుణాలు..**

**పరిమితి రూ.10 లక్షలకు పెంపు**

ఈ మహాసభ వేదికగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాలకు రూ.500 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కును ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలకు సీఎం రేవంత్ రెడ్డి తీపి కబురు అందించారు. ఇప్పటివరకు మహిళా సంఘాలకు రూ.5 లక్షల వరకు మాత్రమే వడ్డీ లేని రుణాలు అందిస్తుండగా, ఇకపై ఆ పరిమితిని రూ.10 లక్షల వరకు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారు. ప్రభుత్వ నిర్ణయంపై మహిళా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా నుంచి డీఆర్డీవో మేన శ్రీను, అడిషనల్ డీఆర్డీవో వెంకటేశ్వర్లు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, ఆయా మండలాల ఏపీఎంలు, పెద్ద సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# గ్రేటర్ వరంగల్‌లో 'స్ట్రీట్ ఫుడ్ హబ్'

- కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక దృష్టి.. రూ.4 కోట్ల నిధులు మంజూరు
- కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ జాయింట్ డైరెక్టర్‌తో జీడబ్ల్యూఎంసీ అధికారుల వీసీ
- తెలంగాణ నుంచి ఎంపికైన ఐదు నగరాల్లో వరంగల్, ఖమ్మం
- వచ్చే వారం వరంగల్‌కు కేంద్ర అధికారుల బృందం రాక



అక్షరదర్బార్, వరంగల్ : గ్రేటర్ వరంగల్ నగర ప్రజలకు త్వరలోనే నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహార ప్రియుల స్వర్గధామం 'స్ట్రీట్ ఫుడ్ హబ్' అందుబాటులోకి రానుంది. కేంద్ర ప్రభుత్వ గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వీధి వ్యాపారుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ఈ ప్రత్యేక ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఇందులో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ జాయింట్ డైరెక్టర్ ఈషా కిరణ్ మంగళవారం ఢిల్లీ నుండి స్వయం సహాయక సంఘాలు, స్ట్రీట్ ఫుడ్ అభివృద్ధి కార్యక్రమాలపై నిర్వహించిన ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో జీడబ్ల్యూఎంసీ అధికారులు పాల్గొన్నారు.

- **తెలంగాణ నుంచి 5 పట్టణాలు ఎంపిక**

కేంద్ర పట్టణ జీవనోపాధి మిషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా మోడల్ స్ట్రీట్ ఫుడ్ హబ్‌లను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రం నుండి ఐదు పట్టణ స్థానిక సంస్థలను ఎంపిక చేయగా, అందులో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) చోటు దక్కించుకుంది. వరంగల్‌తో పాటు ఖమ్మం కార్పొరేషన్, సైబరాబాద్ పరిధిలోని ఒక స్థానిక సంస్థ, ధర్మపురి మరియు వేములవాడ మున్సిపాలిటీలు ఈ పథకానికి ఎంపికయ్యాయి. ఈ హబ్‌ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.4 కోట్ల నిధులను మంజూరు చేయనుంది.

- **ఆకట్టుకున్న 'పవర్ పాయింట్' ప్రజెంటేషన్..**

జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మార్గదర్శకత్వంలో అధికారులు రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ఈ కాన్ఫరెన్స్‌లో కేంద్ర అధికారులకు వివరించారు. వరంగల్‌లో ప్రతిపాదిత స్ట్రీట్ ఫుడ్ హబ్‌కు సంబంధించిన నమూనా డిజైన్లు, త్రీడీ ఫోటోలు, వీడియోలను ప్రదర్శిస్తూ ప్రాజెక్టు ప్రత్యేకతలను చాటి చెప్పారు. జీడబ్ల్యూఎంసీ అధికారులు చూపిన ప్లాన్‌పై కేంద్ర జాయింట్ డైరెక్టర్ సానుకూలంగా స్పందించారు.

- **వచ్చే వారమే కేంద్ర బృందం పరిశీలన**

వరంగల్ నగరంలో స్ట్రీట్ ఫుడ్ హబ్ ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాన్ని స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం వచ్చే వారం వరంగల్‌లో పర్యటించనున్నట్లు సమావేశంలో వెల్లడించారు. నగర ప్రజలకు ఒకే చోట అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహార సేవలు అందించడంతో పాటు, చిన్న వీధి వ్యాపారులకు మెరుగైన శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ హబ్ ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.

## నేడు మేడిగడ్డకు ఉత్తమ్

అక్షరదర్బార్, మహాదేవపూర్: రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం భూపాలపల్లి జిల్లాకు రానున్నారు. ఆయన మధ్యాహ్నం 12:45 గంటలకు మహాదేవపూర్ మండలంలోని మేడిగడ్డకు చేరుకుంటారు. ఇక్కడ కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల టెస్టింగ్ పురోగతిపై ఆయన సాగునీటి శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1:45 గంటలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఖమ్మం జిల్లాకు బయలుదేరుతారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి మేడిగడ్డ పర్యటనను పురస్కరించుకొని అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.





## 20న జాతీయ లోక్ అదాలత్

అక్షరదర్బార్, వరంగల్: తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల్లో, హైకోర్టుతో సహా ఈనెల 20న 2వ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా వివిధ రకాల సివిల్, రాజీకి అనువైన క్రిమినల్, మోటారు ప్రమాద పరిహారం, బ్యాంకు రుణాలు, కుటుంబ వివాదాలు తదితర కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని కోరారు. సంబంధిత శాఖలు, అధికారులు, న్యాయ సేవా సంస్థలు విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గరిష్ట సంఖ్యలో ప్రజలు పాల్గొని లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

## ట్రాఫిక్ సీఐగా ప్రవీణ్ కుమార్



అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రవీణ్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సీతారెడ్డి పదోన్నతిపై వెళ్లిపోయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ప్రవీణ్ కుమార్‌ను హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో చేరిన ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ హనుమకొండ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయనకు ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## అన్ని విధాలా సహకరిస్తా

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ ఇసుక లారీ యజమానుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్ నాయుడు, ప్రధాన కార్యదర్శి యాకూబ్ షరీఫ్, వరంగల్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల భూపాల్ నాయకత్వంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల్ నవీన్ రాజ్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గోపాల్ నవీన్ రాజ్ దీనికి స్పందిస్తూ నూతనంగా ఎన్నికైన వరంగల్ ఇసుక లారీ యజమానుల సంక్షేమ సంఘం కార్యవర్గానికి అభినందనలు తెలియజేయడమే కాకుండా, సభ్యుల, సంఘం శ్రేయస్సు కోసం తక్షణమే అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అందుకు నూతన కార్యవర్గం ఆయనకు కృతజ్ఞతలు తెలిపి సంతోషం వ్యక్తం చేసింది.





## ఘనపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్ : భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిసెట్టి సంకీర్త్, మంగళ వారం ఘనపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు ప్రజల ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించి, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించేలా పనిచేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఐ కరుణాకర్ రావు ఎస్సై అశోక్ ఉన్నారు.

## పెంచిన గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలి

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: కేంద్ర ప్రభుత్వం గత కొద్ది రోజులుగా పెరుగుతూ వస్తున్న గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకుడు అజయ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 3 నెలల వ్యవధిలో 2 సార్లు వంట గ్యాస్ ధరలు పెంచారని దశలవారీగా ఇష్టం వచ్చినట్లు గ్యాస్ ధరలు పెంచుతూ పేదవారి కుటుంబాలకు పెనుభారంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను వెంటనే తగ్గించాలి డిమాండ్ చేసారు.



## పోలీస్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు



భూపాలపల్లి క్రైమ్, అక్షర దర్బార్: భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిసెట్టి సంకీర్త్ ఆధ్వర్యంలో విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందిని అభినందించి పోలీస్ కార్యాలయంలో ప్రశంసాపత్రాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడంలో ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. క్రమశిక్షణ, నిజాయితీ, సేవా దృక్పథంతో విధులు నిర్వర్తించే సిబ్బందిని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని తెలిపారు. పోలీసు శాఖ ప్రతిష్ఠను పెంపొందించే విధంగా ప్రతి ఒక్కరూ తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

# వానకాలానికి డీలర్లు సన్నద్ధం కావాలి

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర



అక్షరదర్బార్, పరకాల: వానాకాలం–2026 సాగు సీజన్‌కు సంబంధించి విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్లు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని హనుమకొండ జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర సూచించారు. పరకాల రైతు వేదికలో నిర్వహించిన సమాయత్తత సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూరియా విక్రయాలు ప్రభుత్వ యాప్ ద్వారానే చేపట్టాలని, స్టాకులను వెంటనే యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. యాప్‌కు వెలుపల యూరియా విక్రయాలు, లైసెన్సులో పేర్కొన్న ప్రదేశం కాకుండా వ్యాపారం నిర్వహించడం వంటి ఉల్లంఘనలకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గడువు ముగిసిన ఉత్పత్తులను విక్రయించరాదని, వాటిని ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేసి వ్యవసాయ అధికారుల ధృవీకరణ పొందాలని సూచించారు. విత్తనాల విక్రయాల్లో లాట్ నంబర్ నమోదు తప్పనిసరి అని తెలిపారు.సమావేశంలో పరకాల సహాయ వ్యవసాయ సంచాలకులు (ఇన్‌చార్జి) ఆది రెడ్డి మాట్లాడుతూ డీలర్లు స్టాక్ పుస్తకాలు, స్టాక్ బోర్డులు, విక్రయ బిల్లులు, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పరకాల డివిజన్ పరిధిలోని ఐదు మండలాల వ్యవసాయ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం

- జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్




భూపాలపల్లి క్రైమ్, అక్షర దర్బార్: జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల సాధన, సంఘం బలోపేతమే ధ్యేయంగా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కాళేశ్వరంలో జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యామ్, హెల్త్‌కార్డు సభ్యుడు సామల శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంకణాల సంతోష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇటీవల మృతి చెందిన జర్నలిస్టులను స్మరించుకుంటూ రెండు నిమిషాల మౌనం పాటించారు. జర్నలిస్టుల సంక్షేమం, హెల్త్‌కార్డుల జారీ, ఇళ్ల స్థలాల కేటాయింపు, జర్నలిస్టు ప్రొటెక్షన్ యాక్ట్ అమలు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటమే మార్గమని, రాష్ట్రవ్యాప్తంగా పాత్రికేయుల సంక్షేమం కోసం టీయూడబ్ల్యూజే కృషి చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డులు, ఇళ్ల స్థలాలు ప్రతి జర్నలిస్టుకు అందేలా సంఘం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. జర్నలిస్టుల హక్కుల సాధనలో టీయూడబ్ల్యూజే చేసిన సేవలను గుర్తు చేస్తూ ప్రతి పాత్రికేయుడు సంఘంతో అనుబంధం పెంచుకోవాలని పిలుపునిచ్చారు. సంఘ బలోపేతానికి సభ్యత్వ నమోదు కీలకమని పేర్కొంటూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని జర్నలిస్టులందరూ సభ్యత్వాలు నమోదు చేసుకుని సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ నెల 29న భూపాలపల్లిలో నిర్వహించనున్న జిల్లా మాససభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు సట్ల మురళి, ఎంఎల్ఎన్ మూర్తి, శ్రీశైలం, ప్రవీణ్‌కుమార్, చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, మూబిన్, టెమ్జే అధ్యక్షుడు సాంబయ్య, రజనీకాంత్‌తో పాటు జిల్లాలోని వివిధ మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు. జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమ సాధన దిశగా ఈ సమావేశం ఉపయోగకరంగా నిలిచిందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

# 14వ వార్డులో డ్రైనేజీ సమస్యలపై వినతి

- సానుకూలంగా స్పందించిన కమిషనర్



అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ 14వ వార్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వార్డు కౌన్సిలర్ కొక్కిరాల దీప్తి రాకేష్‌రావు మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్‌కు వినతిపత్రం అందజేశారు. పలు వీధుల్లో మురుగునీరు రోడ్లపైకి చేరుతుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె వివరించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగు కాల్వల మరమ్మతులు, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ వర్షాకాలం ప్రారంభానికి ముందే యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాడి భగవాన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఇంగిలి వీరేష్‌రావు, నాగరాజు, కృపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎవరి కులం ఎంతో! వారికంత వాటా కావాలి

○ బీసీ ఎస్సీ ఎస్టీ జాక్ భారీ బహిరంగ సభ కరపత్రం ఆవిష్కరణ



అక్షర దర్బార్ చిట్యాల : సామాజిక న్యాయం రాజ్యాధికారం కోసం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ మద్దతుతో బీసీ, ఎస్సీ, ఎస్టీ– జాక్ ఆధ్వర్యంలో చిట్యాల మండల కేంద్రం బహిరంగ సభ కర పత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ రాదండి దేవేందర్ చిట్యాల గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ లు మంగళవారం మాట్లాడుతూ... బీసీ ఎస్టీ ఎస్సీలను సమాన న్యాయం వైపుగా చైతన్యపరిచి "సామాజిక న్యాయం – రాజ్యం కోసం సమరం సాగించాలని వారు కోరారు. రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాలలో భాగంగా భూపాలపల్లి జిల్లాలో 90శాతం పైన ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలను చైతన్యం చేస్తున్న క్రమంలో జూన్ 26 తేదీన భూపాలపల్లి జిల్లాలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామని ఈ సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత మనం దరిపై ఉందన్నారు రెడ్లు వెలమ, బ్రాహ్మణుల కబంధ హస్తాలలో బంధీ అయిన భూపాలపల్లి జిల్లా గడ్డను విముక్తి చేయడానికి పెద్ద ఎత్తున అన్ని గ్రామాల నుండి తరలిరావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బిసి ఎస్సీ ఎస్టీ జేఏసీ జిల్లా కో ఆర్డినేటర్ కొత్తూరి రవీందర్, బొంపెల్లి కిషన్, గుండ తిరుపతి, జాలిగాపు కృష్ణ, పుల్ల అశోక్, శీలపాక నాగరాజు, గోల్కొండ సురేష్, చిలుముల కృష్ణ, శశి కుమార్, పర్లపల్లి వంశీ, కొర్రి వెంకటేష్, సరిగమ్ముల అజయ్, ఆరెపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు



## మెరుగైన వైద్యం కోసం రెండు లక్షల ఎల్ఓసీ ఇప్పించిన సిరికొండ

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలం గుంటుపల్లి కి చెందిన బీ ఆర్ఎస్ సీనియర్ నాయకులు పువ్వాటి హరికృష్ణ మామగారు తీవ్రమైన అనారోగ్యం పాలు కాగా ఆయనకు మెరుగైన వైద్యం కోసం శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి గారు రెండు లక్షల రూపాయల ఎల్ఓసి ని ఇప్పించారు. హరికృష్ణ ద్వారా ఆయన మామ గారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న తక్షణమే మాజీ స్పీకర్ మధుసూదనా చారి స్పందించి ఎల్ఓసి ఇప్పించినందుకు హరికృష్ణ ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

## సాదా బైనామా , భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలి

### ఏవైఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య



అక్షర దర్బార్, చిట్యాల : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సాధబైనామా, భూ భారతి లో భూములు పట్టాలు చేయాలని దరఖాస్తు చేసుకున్న వాటిని పరిశీలించి పట్టాదారునికి పట్టా పాస్ బుక్కులు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య ప్రభుత్వాన్ని, సంబంధించిన అధికారులను డిమాండ్ చేశారు. చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు అద్యక్షతన మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సాదా బైనామా లో వచ్చిన దరఖాస్తలను గత నుండి పరిస్కరించలేదని ఇప్పటి ప్రభుత్వం హయంలో భూ భారతి లో భూములు పట్టా బుక్కుల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉచితంగా పట్టాబుక్కులు ఇస్తామని చెప్పి ఇప్పటికి పెండింగ్ లో పెట్టడం సరియైనది కాదన్నారు. కొందరివి డీఎస్ పెండింగ్ లో ఉన్న వాటిని దరఖాస్తు చేసుకున్న వారందరివి పరిస్కరించి పట్టా బుక్కులు అందించాలన్నారు. తమ భూములకు పట్టా పాస్ బుక్కులూ లేక పోవడం వలన రైతు బంధు రైతు బీమా ఇతర లావాదేవీలు రావడంలేదని తెలిపారు. సంబంధించిన అధికారులు ప్రభుత్వము వెంటనే సాదా బైనామ, భూభారతి లో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను పరిశీలన చేసి తక్షణమే పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని సంబంధించిన అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల నాయకులు గుర్రపు తిరుపతి గడ్డం సదానందం తదితరులు పాల్గొన్నారు.

## 20న భూపాలపల్లిలో మెగా లోక్ అదాలత్

**రాజీమార్గమే రాజమార్గం అవుతుందని చిట్యాల ఎస్ఐ సతీష్ విజ్ఞప్తి..**

అక్షర దర్బార్ , చిట్యాల : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఈనెల 20న మెగా లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని ఈ అదాలతో పూర్తిస్థాయిలో ప్రజలు వినియోగించుకోవాలని చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ కోరారు మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ లోక్ అదాలత్ లో పరిష్కారమయ్యే కేసులను త్వరితగతిన పరిష్కరించుకునేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. చిన్న చిన్న కేసులు యాక్సిడెంట్ కేసులు సివిల్ తగాదాలు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెట్టి కేసులు కొట్టుకున్న కేసులు ఫ్యామిలీ కేసులు లోక్ అదాలాతులో పరిష్కారం అవుతాయని ఆయన తెలిపారు దీనిద్వారా సమయం ఆదావుతుందని ఖర్చులు తగ్గిపోతాయని శాశ్వతమైన పరిష్కారం లభిస్తుందని స్నేహపూర్వకమైన పరిష్కారం అందుతుందని దీనితో మనశ్శాంతి కలుగుతుందని లోక్ అదాలకు ద్వారా మీ సమస్యను పరిష్కరించుకునేందుకు సంబంధికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ సతీష్ కోరారు.

## మోరంచలో ఇరుక్కున్న ఇసుక ట్రాక్టర్లు

○ గంటల తరబడి ప్రయాణికులకు తప్పని తిప్పలు

○ నిరుపయోగంగా హై లెవెల్ బ్రిడ్జి

అక్షర దర్బార్ చిట్యాల : చిట్యాల మండలం నైన్ పాక గ్రామ శివారు లోగల ఆమోరంచవాకులో ఇసుక ట్రాక్టర్లు ఇరుక్కుపోవడంతో ( దిగబడడంతో) అటుగా వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి ఇబ్బందులు పడ్డారు మూరంచ వాగుపై నిర్మించిన హై లెవెల్ వంతెన అధికారుల నిర్లక్ష్యం మూలంగా అందుబాటులోకి రాకుండా నిరుపయోగంగా మారిపోయింది. మండలం నుండి ఇదే ద్వారద్వారా ఇదే దారి ద్వారా నేరేడుప ల్లి వాజినపల్లి గొర్లవీడు సెల్వార్ భూపాలపల్లి తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ప్రయాణికులు నిత్యం ఇదే దారి గుంట వెళుతుంటారు. మొరంజ్ వాగ్లో తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేసినప్పటికీ అధికలోడులతో ఇసుక ట్రాక్టర్లు నిత్యం ఇదే దారి గుంట వెళుతుండడంతో దారి మొత్తం ధ్వంసం అయిపోయి కనీసం పాదచారులు సైతం దాటలేని పరిస్థితిలోకి చేరుకుంది దీనితో నిత్యం మూరంచవాగులో వాహనాలు దిగబడుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ దారికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి ప్రయాణికులు ఇతర వాహనాలు సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



## రూ.1000 లంచానికి లక్ష బహుమతి తెలంగాణలో అమలు చేయాలి

### ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జి శనిగరపు మహేష్



అక్షర దర్బార్ చిట్యాల : ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కడైనా ఎప్పుడైనా వెయ్యి రూపాయల లంచం తీసుకుంటే సాక్షాధారాలతో నిరూపించిన వారికి లక్ష రూపాయల బహుమతి ఇచ్చే విధానాన్ని తెలంగాణలో ప్రవేశపెట్టాలని వీసీకే పార్టీ ఉమ్మడి జిల్లాల ఇన్చార్జి శనిగరపు మహేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు మంగళవారం ఆయన చిట్యాల మండల కేంద్రంలో మాట్లాడుతూ తమిళనాడు ప్రభుత్వం సరికొత్త ప్రోత్సాహక పథకాన్ని అధికారికంగా ప్రకటించిందని అదే విధానాన్ని తెలంగాణ లో కుడా అమలు చేస్తే ప్రతి పేదవాలకి న్యాయం జరిగే అవకాశాలు చాలా ఉన్నాయన్నారు. ఈ నూతన విధానం ప్రకారం ఏ ప్రభుత్వ శాఖలోనైనా సరే, ప్రజల నుండి కేవలం రూ.1000 లంచం డిమాండ్ చేసినా.. ప్రజలు సాక్ష్యాధారాలతో స్వేచ్ఛగా ఫిర్యాదు చేయవచ్చు నన్నారు లంచాలు అడిగే అధికారులపై సరైన ఆధారాలతో ఫిర్యాదు చేసిన పౌరులకు ప్రభుత్వం తరపున రూ.1,00,000 నగదు బహుమతి ఇస్తామని ప్రకటన చేస్తే . ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని పూర్తిగా నిర్మూలించడానికి ప్రతి ఒకరు భాగస్వాములు కావచ్చునని తెలిపారు ప్రభుత్వం స్పందించి ఈ దిశగా ఆలోచించాలని మహేష్ విజ్ఞప్తి చేశారు.



## మెడికల్ కాలేజీకి నూతన ప్రిన్సిపాల్‌గా డా. సంధ్య

అక్షర దర్బార్, నర్సంపేట: నర్సంపేట పట్టణంలోని జిల్లా స్థాయి మెడికల్ కాలేజీకి నూతన ప్రిన్సిపల్ గా డా. సంధ్య నియమితులయ్యారు. మంగళవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి స్టాఫ్ ఏడీ సాజిద్ అలీ, ఆఫీస్ సూపరింటెండెంట్, టీ. ఎన్.జీ.ఓ స్టేట్ ఈసీ మెంబర్ ఎండీ. మొయిజుద్దీన్, ఆఫీస్ సూపరింటెండెంట్ రవీందర్ తదితరులు నూతన ప్రిన్సిపాల్ కి బొకే అందజేసి ఆహ్వానించారు.